

న్యూస్ బాక్స్

మండల వ్యవసాయాధికారిగా సుష్మ



తాండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల వ్యవసా యాధికారిగా సుష్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జీ ఏవో ప్రేమ్‌కుమార్ నుంచి బాధ్యతలు అందుకున్నారు. సుష్మ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటా నని పేర్కొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్‌లు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్‌లు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంఎల్‌టీలో 30, డీఎఎస్‌టీలో 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20లోగా అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. డిసెంబరు 2 నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు.

నేడు గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబాజస్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంఘాల నాయకులు, యువకులు ఉద్యోగులు, రాజకీయ నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రారంభమైన వరి కోతలు

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- 326 కేంద్రాలకు ప్రారంభమైనవి 140 మాత్రమే
- తేమ శాతం అధికంగా ఉండటమే కారణం
- కేంద్రాల వద్ద కానరాని కనీస వసతులు
- టార్పాలిన్లు, గోనె సంచుల కొరతతో ఇబ్బందులు
- సీజన్‌లో 3 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం



సీతారాంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్ (ఫైల్)

మంచిర్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. వరికోతలు ప్రారంభించక ముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని భావించినా ఆచరణలో అమలు కావడంలేదు. ఫలితంగా కోతలు పూర్తయి పంట చేతికి వచ్చిన రైతులు ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. 17 శాతం తేమ ఉండాల్సి ఉండగా, గరిష్ఠంగా 40శాతం మేర ఉండటమే ధాన్యం సేకరించక పోవడానికి కారణమని సివిల్‌సప్లయిస్ అధికారులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకు, చివరికి పంటను అమ్ముకునే సమయంలోనూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు అంతంత మాత్రమే ఉండటం కూడా రైతుల పాలిట శాపంగా మారుతోంది.

కొనుగోలు లక్ష్యం ఘనం

ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 3,29,983 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 136 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 129, మెప్మా ఆధ్వర్యంలో 10, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 51 కేంద్రాలు ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే నేటి వరకు కేవలం 140 కేంద్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. వరి కోతలు ఊపందుకోవడంతో కలెక్టర్ కుమార్‌దీపక్ రెండు రోజులుగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఇప్పటి వరకు ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో 122, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 15, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 3 సెంటర్లను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లు అంతంత మాత్రమే

ప్రతీ సీజన్‌లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలు నిండా ముంచుతున్నాయి. టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిసి ముద్దవుతోంది.

మిగతా 7లో

నేడు గూడెంలో కార్తీక పౌర్ణమి మహాజాతర

- ఏర్పాట్లను పరిశీలించిన ఆలయ ఈవో, సీఐ, ఎస్సైలు



విద్యుత్ దీపాలకరణతో గూడెం శ్రీసత్య నారాయణస్వామి సింహ ద్వారం

దండేపల్లి, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గూడెంగుట్టపై కొలువుదీరిన రమాసహిత సత్యనారాయణ ఆలయంలో శుక్రవారం జరిగే కార్తీక పౌర్ణమి మహాజాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పలు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు రానున్నారు. ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. వేలాది మంది దంపతులు స్వామి వ్రతాలను కింద, పైన వ్రత మండపాల్లో ఆచరిస్తారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గుట్టపైకి ఎక్కడానికి ఒక దారి, దిగడానికి మరో దారి ఏర్పాటు చేశారు. బారికేడ్లు, భక్తులు సేద దీరేందుకు శామియనాలు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. సీఐ అల్లం నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ఆలయం, గోదావరి తీరం వద్ద సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ అల్లం నరేందర్ తెలిపారు.



ఘాట్‌రోడ్డు వద్ద స్వామి దర్శనం కోసం ఏర్పాటు బారికేడ్లను పరిశీలిస్తున్న సీఐ ఈవో, ఎస్సై

జాతరకు ఏర్పాట్లు పూర్తి



కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం గూడెం ఆలయంలో జాతరకు ఏర్పాట్లు పూర్తి చేరసినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా షామియనా, తాగునీరు ఏర్పాటు చేశాం. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. జాతరకు సుమారు లక్ష వరకు భక్తులు వస్తారని అంచనా. ఘాట్‌రోడ్డు నుంచి క్యూలైన్లు, గుట్టపైకి ఎక్కడానికి ఒక దారి, దిగడానికి మరో దారి ఏర్పాటు, క్యూలైన్ల కోసం బారికేడ్లు, గుట్ట కింద, పైన ప్రధానాలయం పక్కన వ్రత మండపాలను ఏర్పాటు చేశాం. ఆలయ సిబ్బంది, సేవ సమితితో పాటు మరో 200 మంది పోలీసు సిబ్బందిని సేవలందిస్తారు. ప్రధానాలయం పక్కన రూ. 1500, గుట్ట కింద వ్రతాలు ఆచరించే వారు రూ. 600 చెల్లించాలి. భక్తులు పూలు పండ్లు, మంగళహారతి, ఇతర అలంకరణ వస్తువులు వెంట తెచ్చుకోవాలన్నారు. భక్తుల కోసం 30 వేలపైగా లడ్డు, 20వేల పులిహోరలను సిద్ధం చేస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేస్తున్నాం.

\- ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ నెల 20 వరకు వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. లైబేరియన్‌లు రమేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ సాగుకు భిన్నంగా..

- చేపల పెంపకం చేపడుతున్న రైతు
- సత్ఫలితాలతో ముందుకు

6



ప్రేమానంద్ సాగు చేస్తున్న చేపల చెరువు

రైతు సేవలో కేవీకే

- కేవీకే ఆధ్వర్యంలో కోళ్లు, విత్తనాల పంపిణీ
- సాగులో మెళకువలు..
- రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

7



కేవీకేలో విత్తనాల ఉత్పత్తికి వేసిన వరి పంట

ఆరోపణలు చేస్తే సహించేది లేదు

విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు

నస్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ వేణు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌పై అనవసరమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీజేపీ పట్టణ నాయకులు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం కొండ వెంకటేశ్, ఈర్ల సదానందంలతో కలిసి పట్టణ అధ్యక్షుడు రమేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డు మంటలతో చుట్టూ పక్కల నివసించే ప్రజల ఊపిరాడని పరిస్థితి ఏర్పడినా పట్టించుకునే నాథుడు లేడన్నారు. సీసీసీ కార్నర్ వద్ద మూత్రశాలలు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందన్నారు. నస్పూర్‌లో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు కూల్చివేస్తామని చెప్పి ఒక ఇళ్ళు కూల్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. నాయకులు సదయ్య, కుర్ర చక్రవర్తి, కుటుకూరి తిరుపతి, మహేష్, రవనవేని శ్రీనివాస్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): విమర్శలు మాని అభివృద్ధి చేసి చూపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం స్వామి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌పై ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎల్లంపల్లి ముంపు ప్రజలకు రావాల్సిన నష్టపరిహారాన్ని వంద రోజుల్లో చెల్లిస్తామని 300 రోజులైనా చెల్లించలేదన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. వెంకటరమణరావు, మడిపల్లి సత్యనారాయణ, మల్లేష్, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మందమర్రిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం సారంగపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రూ.1.19 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గండె రాంచందర్, మాజీ సర్పంచు కొమురయ్య, కమల్ మనోహర్‌రావు, బండి సదానందం యాదవ్, పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలి

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ, ప్రగతి కోసం పాటుపడుతున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రిలో సెల్ ఫోన్ షాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. లగచర్లలో అధికారులపై దాడులు చేయడం సరికాదని తెలిపారు. ప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు దాడులకు ప్రేరేపిస్తున్నారన్నారు. పత్తిపాక రాజయ్య కొడుకు శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని, నాగుల రాజయ్య కుమారుడు ప్రమాదంలో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, నాయకులు బండి సదానందం యాదవ్, సొత్కు సుదర్శన్, పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన నాయకులు

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లక్షెట్టిపేటలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. విషయం తెలుసుకున్న మందమర్రి కాంగ్రెస్ నాయకులు ఎంపీని కలిసి పలు సమస్యలు విన్నవించారు. రైల్వేస్టేషన్‌లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరారు. అనంతరం సన్మానించారు. బండి సదానందంయాదవ్, పెద్ది రాజన్న తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి అడవుల్లోకి పెద్దపులి



వెంకటాపూర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలో 15 రోజులుగా హల్‌చల్ చేసిన పెద్దపులి గురువారం తిర్యాణి అడవుల్లోకి వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం మల్కేపల్లి నర్సింగసాగర్ చెరువు సమీపంలో వెంకటాపూర్ చెందిన జుగునాక బాజిరావు ఆవుల మందపై పులి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం బాధితుడు స్థానికులకు చెప్పడంతో అప్రమత్తమైన అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. సోనాపూర్ అడవిని దాటి తిర్యాణి మండలం ఏదులపాడ్ బీట్‌లోకి పులి వెళ్లినట్లు అటవీ అధికారులు గుర్తించారు. మళ్లీ పులి తిరిగి మంచిర్యాల డివిజన్‌లోకి వచ్చే అవకాశాలు ఉండడంతో అటవీ సమీప ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పులి దాడిలో పశువులు మృతి చెందితే ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని, పులికి హానీ తలపెట్ట వద్దని అధికారులు సూచించారు.

వ్యాపారులపై కక్షతోనే కూల్చివేతలు



మార్కెట్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

గర్మిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులపై కక్షతోనే కూల్చివేతలు చేపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం అర్చనటెక్స్ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్చనటెక్స్ చౌరస్తా నుంచి మార్కెట్ రోడ్డు వెడల్పును మున్సిపల్ అధికారులు ఎలాంటి టెండర్లు నిర్వహించకుండ చేపట్టారన్నారు. డీపీఆర్, బడ్జెట్ కేటాయింపులు లేకుండా వ్యాపారులపై కక్షతోనే కట్టడాలను కూల్చివేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యాపారులు ఓటు వేయలేదనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే ఈ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అక్రమ కట్టడాలు కూల్చివేస్తే తమకేమి ఇబ్బంది లేదని, కానీ రోడ్డు విస్తరణ పేరుతో ఎలాంటి ప్రణాళిక లేకుండా వ్యాపారులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. అభివృద్ధి చేస్తే స్వాగతిస్తాం కానీ ఇలాంటి కక్షపూరిత చర్యలు చేస్తే సహించమని పేర్కొన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని లేదంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి, స్థానిక ఎమ్మెల్యేకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరిస్తాం : వ్యాపారులు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యాపారస్తులు

మంచిర్యాల అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమవంతుగా పూర్తి సహకారం అందిస్తామని వ్యాపారస్తులు అన్నారు. గురువారం మహేశ్వరి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యాపారులు మాట్లాడుతూ పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో 30 ఏళ్ళ క్రితం నిర్మించిన రోడ్లే ఉన్నాయని, పెరిగిన జనాభా, రద్దీ కారణంగా రోడ్లు ఇరుగ్గా మారాయన్నారు. మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని, పార్కింగ్ కోసం స్థలం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమస్యను చాలా మంది నాయకుల దృష్టికి తీసుకువెళ్లామని, అయినా పరిష్కరించలేదన్నారు. ఎమ్మెల్యే రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. అందులో భాగంగా కొన్ని నిర్మాణాలను తొలగించాల్సి వస్తుందని, ఆ విషయంలో బాధ కల్గించినప్పటికీ భవిష్యత్తు తరాలకు మేలు కల్గుతుందన్నారు. కొందరు నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారు. పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తయారు చేసేందుకు, అభివృద్ధిలో పట్టణాన్ని ఆదర్శవంతంగా నిలిపేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, అందుకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. వ్యాపారులు ఇస్మైల్, ఆర్.మహేష్, అజయ్ అగర్వాల్, భగవాన్ వ్యాస్, మోహన్‌లాల్ కేడియా, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడిని ఖండిస్తూ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న, ఉద్యోగులు

నస్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎన్‌జీవో కార్యదర్శి భూముల రాంమోహన్, అసోసియేట్ అధ్యక్షుడు సీపతి బాపు, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, ట్రెస్సా అధ్యక్షుడు శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపులు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది, కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలకు మేలు చేసే వారిపై దాడులు చేయడం సరైంది కాదన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో అధికారులపై జరిగిన దాడికి నిరసనగా తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్‌ల జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): అధికారులపై జరిగిన దాడికి నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంపు రైతులను ఆదుకోవాలి

చెన్నూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్ మండలాల్లో కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటలు ముంపునకు గురవుతున్న రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. బావురావుపేట గ్రామ శివారులో గురువారం సీపీఎం ఏరియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8,9 తేదల్లో సీపీఎం మంచిర్యాల జిల్లా 3వ మహాసభలో చేసిన తీర్మాణాలను వివరించారు. ముంపు ద్వారా రైతులు, ప్రజలు రూ. 12 వేల కోట్ల వరకు నష్టపోవడం జరిగిందని, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.









బాలల దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిన్నారులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పాఠశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి



ఇటిక్యాలలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

లక్సెట్టిపేటరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం గుల్లకోటలో గ్రామీణాభివృద్ధిశాఖ, ఇటిక్యాలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సన్నరకం వడ్లకు మద్దతు ధరతోపాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. సన్నరకం, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేస్తామన్నారు. రైతుల వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేసి 48 గంటల్లోగా ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. రైతు వేదికలో ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17 శాతానికి లోపు తేమ ఉన్న సన్నరకం ధాన్యానికి రూ.2320తో పాటు రూ.500 బోనస్‌తో రూ.2830 చెల్లిస్తుందని పేర్కొన్నారు. కళ్లాల్లోనే ధాన్యం ఆరబెట్టుకొని తీసుకురావాలన్నారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి బ్రహ్మరావు, ఆర్డీవో హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీకళ, భీమిని ఏడీఏ సురేఖ, తహసీల్దార్ రమేష్ వ్యవసాయ అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని అదనపు కలెక్టర్‌కు వినతి

వేతనాలు చెల్లించాలని పంచాయతీ పారిశుధ్య కార్మికులు అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు అవగాహన సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన అదనపు కలెక్టర్‌ను కలిశారు. ఐదు నెలలుగా జీతాలు రాక ఇళ్లు గడవడం కష్టంగా ఉందన్నారు. ప్రతీ నెల 1న జీతాలు అందేలా చూడాలని కోరారు. లేతకారి కుమార్, తోట వెంకటేష్, గట్టు అశోక్‌గౌడ్, తలండి శ్రీనివాస్, లింగంపల్లి వెంకటి, చిలుకయ్య పాల్గొన్నారు.

గంజాయి సేవించినా, అమ్మినా కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

జైపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా గంజాయి సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకొంటామని ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఏసీపీ కార్యాలయంలో సీఐ వేణుచందర్‌తో కలిసి మాట్లాడారు. నర్వ గ్రామ శివారులో గురువారం కొందరు గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నారని పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తున్న పోతరాజుల ఆకాష్, దూట రాజ్‌కుమార్, షేక్ అఫ్రిది, తోట ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1.380 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ శ్రీధర్, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.మల్లయ్య, కానిస్టేబుల్ సదానందంలను ఏసీపీ అభినందించి పారితోషికం అందించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. గురువారం గాంధీనగర్‌లో తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌తో పలు వార్డుల్లో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేశారు. గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మహేందర్, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

బొమ్మ తుపాకీతో దుండగుల బెదిరింపు

లక్సెట్టిపేటరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్కూరు చౌరస్తా సమీపంలో బొమ్మ తుపాకీతో ఓ వైన్స్‌షాప్ క్యాషియర్‌ను బెదిరించి డబ్బులు దొంగలించేందుకు ఇద్దరు దుండగులు విఫలయత్నం చేశారు. ఈ నెల 12న రాత్రి ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మారుతి వైన్స్‌లో క్యాషియర్‌గా పనిచేసే మెరుగు లక్ష్మీరాజం రాత్రి 10 గంటలకు వైన్‌షాప్ బంద్ చేసి బైక్‌పై షాపు యజమాని ఇంటికి వచ్చాడు. అప్పటికే అక్కడ ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు తలపై బొమ్మ తుపాకీ పెట్టి బెదిరించారు. లక్ష్మీరాజం అప్రమత్తమై కేకలు వేస్తూ ఓనర్ ఇంటిలోకి పరిగెత్తాడు. దీంతో దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుడు గురువారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. సతీష్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత అంగడి బజార్ ఏరియాకు చెందిన యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఎస్‌కె గౌస్, ఎస్‌కె సాబీర్‌లపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ పున్నంచంద్ తెలిపారు. యువతి చేయి పట్టి అసభ్యంగా ప్రవర్తించారని, బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

బెల్లంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఏరియా ఆసుపత్రిలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఆసుపత్రిలోని స్పెషల్ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గదిలో ఉన్న ఏసీ, థర్మకోల్‌తో ఉన్న గది పైకప్పు దగ్ధమయ్యాయి. గమనించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుకర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో వార్డులో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మంచిర్యాల అర్బన్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డుకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ-ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సురేఖ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నకిలీ విత్తనాలతో పంట నష్టం

జన్నారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులు ఒకే కంపెనీకి చెందిన వరి విత్తనాలు కొని నష్టపోయి లబోదిబోమంటున్నారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు ఫెర్టిలైజర్ షాపుల్లో నూజివీడు అన్నపూర్ణ రకం వరి విత్తనాలు కొనుగోలు చేశారు. వరి ఏపుగా పెరుగుతుందే తప్ప గొలుసు, గింజ ఎదగకపోవడంతో దిగుబడి రాలేదు. రైతులు షాపులకు వెళ్లి అడగగా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. కంపెనీ బృందాలు పంటలను పరిశీలించాయని, నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. దీంతో విత్తనాలు అమ్మిన ఫెర్టిలైజర్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యాయలంలో చందు, దర్మ, తిరుపతి, గబ్బర్‌సింగ్, అమర్‌సింగ్ ఫిర్యాదు అందజేశారు.

వాడబలిజ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

మంచిర్యాల అర్బన్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): వాడబలిజ కులం పేరుతో ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్ర దమోదర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అధ్యక్షుడు బొడెంకి మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పలు జిల్లాలో జారీ చేస్తున్నా మంచిర్యాలలో ఇవ్వడం లేదన్నారు. సర్టిఫికెట్ల జారీ విషయమై డిసెంబర్ 9న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, కలెక్టరేట్ ఎదుట నిరసనలు చేపడుతామన్నారు. గగ్గూరి రాజన్న, గారె శంకర్, పానెం పరశురాం, బొడెంకి కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

సంప్రదాయ సాగుకు భిన్నంగా..

● చేపల పెంపకం చేపడుతున్న రైతు ● సత్ఫలితాలతో ముందుకు



చేపలకు ఆహారం అందిస్తున్న రైతు ప్రేమానంద్

పెంచికలపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఆధారితమైన మనదేశంలో దాని అనుబంధం రంగాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. సంప్రదాయ పంటలతోపాటు పశువుల పెంపకం రైతులకు ముఖ్యమైన ఆదాయవనరు. అయితే మిశ్రమ సాగు విధానాన్ని పూర్తిస్థాయిలో చేపట్ట డంలో ఇక్కడిరైతులు ఇప్పటికీ వెనకబడే ఉన్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. సంప్రదాయ పంటలపై ఆధారపడకుండా సమీకృత వ్యవసాయంలో మిశ్రమ పంటల సాగు విధానం చేపడితే రైతుల అభివృద్ధికి అడుగులు పడతాయి. దీనిని పాటిస్తూ.. ఒకరైతు ఆదర్శంగా నిలుస్తున్నాడు పెంచికలపేట మండలకేంద్రానికి చెంది ఒంద్రే ప్రేమానంద్.

మండల కేంద్రానికి చెందిన ఒంద్రే ప్రేమానంద్ అనే రైతు తనకు ఉన్న కొంతభూమిలో వరిపంట సాగు చేస్తూనే మరో ఎకరం భూమిలో చేపల పెంపకం చేపట్టారు. చేపల చెరువును రెండు మీటర్లలోతులో ట్రాక్టర్ సహాయంతో చదును చేసి ఏర్పాటు చేసుకున్నాడు. దేశీయ రకాలైన బంగారు తీగ, వృకుచందు, బొచ్చ, రవులతో పాటు స్పాన్ అనే విదేశీ రకం చేపల్ని ఛత్తీస్‌గడ్ నుంచి దిగుమతి చేసుకొన్నాడు. సుమారు నాలుగువేల చేప పిల్లలను చెరువులో వదిలాడు. రెండు నెలల క్రితం చెరువులో చేప పిల్లలను వదలగా ఇప్పుడు అవి 200నుంచి 250గ్రాముల వరకు బరువు పెరిగాయి. అయితే ఇంకో రెండు నుంచి మూడునెలల్లో ఒక్కోచేప కేజి నుంచి రెండు కిలోల వరకు బరువు పెరుగుతుంది అంటున్నాడు. అయితే చేపల పెంపకంలో కూలీల అవసరం కూడ తుక్కువగా ఉండడంతో ఒక్కడే నిర్వహణ చేసుకుంటున్నాడు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలు చేపలకు ఆహారాన్ని అందిస్తాడు. చేపల ఆహారంలో ఎక్కువగా ఎద్దు గానుగ పిండి, తవుడు, బియ్యాన్ని ఉడికించి ఆహారంగా అందిస్తాడు. చెరువులో వారం రోజులకు ఒకసారి పాత నీరును వదిలి కొత్తనీరు నింపుతాడు. మార్కెట్‌లో కూడా చేపలకు గిట్టుబాటు ధర లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో రైతు ప్రయోగం లాభాల దిశగా సాగుతోంది.

చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపడతా..



చేపల పెంపకం ఆశాజనకంగా ఉంది. వచ్చే సంవత్సరం రెండు ఎకరాల్లో చేపల పెంపకానికి ప్రణాళిక తయారు చేసుకున్నాను. చేపల పెంపకంపై బెల్లంపల్లి కృషివిజ్ఞాన కేంద్రంలో శిక్షణ తీసుకున్నాను. అలాగే పలుచోట్ల చేపల చెరువులను సందర్శించి రైతుల అనుభవాలు తెలుసుకున్నాను.

-ఒంద్రే ప్రేమానంద్, రైతు

నర్సరీ పనులు త్వరగా పూర్తి చేయాలి

వాంకిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నర్సరీ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నర్సరీపనులు మొదలుపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జావీద్, ఏపీవో శ్రావణ్‌కుమార్, ఈసీ మోసిన్ తదితులు ఉన్నారు.

వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

వాంకిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆరోగ్య, విద్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఖిరిడిగ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు గురువారం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, ఏఎన్‌ఎం కృష్ణ కుమారి, సిబ్బంది సౌమ్య, లక్ష్మి, హెచ్‌ఎం శోభ పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం బహుజనులు ఏకం కావాలి

ఆసిఫాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బహుజనులందరే ఏకం కావాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశం లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎస్సీ ఎస్టీ, బీసీల జనాభా అధికంగా ఉన్నప్పటికీ అగ్రవర్ణాలే పాలిస్తున్నారన్నారు. బహుజనులందరు ఏకమై రిజర్వేషన్ల ప్రకారం హక్కులను కల్పించుకుంటూ రాజ్యాధికారం కోసం ఐక్యంగా ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడుగా భుక్యరాజు, జిల్లా ఉపాధ్యక్షుడుగా ముబషిర్ హుస్సేన్, ఈసీ మెంబర్‌గా మహ్మద్ సిరాజ్‌ను నియమించి వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్రప్రధాన కార్యదర్శి వెంకన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగ సమాజంపై జరిగినదాడిగా అభివర్ణిస్తూ గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ ఉద్యోగుల ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో డీఆర్వో లోకేశ్వర్‌రావు, కలెక్టరేట్ ఏవో మధుకర్,ఆయాశాఖల అధికారులు, ఉద్యోగుల ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రాణహిత నదిలో ప్రత్యేక పూజలు



ప్రాణహితకి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చింతలమానేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ప్రాణహిత నది, గంగలో భక్తుల తాకిడి పెరిగింది. పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేకపూజలను నిర్వహిస్తున్నారు. గురువారం వైకుంఠ చతుర్థి సందర్భంగా వేదపండితులు రాజశేఖర్ చారి ఆధ్వర్యంలో గంగాదేవికి హారతి, శివుడికి పూజ నిర్వహించారు. అలాగే మండలంలోని కోర్సిని, గూడెం గంగానదుల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిం చేందుకు వెళ్తున్నారు. కార్తీకమాసం సందర్భంగా మహిళలు గ్రామాల్లో వేకువజామునే లేచి తమ ఇళ్లలో ప్రత్యేకపూజలు నిర్వహించడం, గ్రామాల్లోని ఆలయాల్లో దీపారాధన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

మెస్ చార్జీలు పెంచాలి: ఎస్ఎఫ్ఐ



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కెరమెరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన మెస్‌చార్జీలు పెంచాలని గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈవో ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఒక్కోవిద్యార్థికి రూ.9.95 అందిస్తుందని అవిపెరిగిన నిత్యావసర ధరలకు సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, కరణ్, సంగీత, బాలాజీ, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలల్లో ఖాళీగాఉన్న అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ్యకర్త బి శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. జెఎల్ బాటనీ-1, గణితం-1, పీజీటీ-1, టీజీటీ తెలుగు-1, గణితం-2, ఇంగ్లీష్-2, హిందీ-1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంఎస్సీ బీఈడీ, ఎంఏ బీఈడీ, టెట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల16న ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాల,కళాశాలలో డెమోకు హాజరుకావాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆసిఫాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్‌యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం విశ్వనాథ్ ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి గంటపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు తమ సమస్యలు సలహాలను 9959226006కు ఫోన్‌చేసి తెలియజేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాయిబ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గం

ఆసిఫాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణ నాయిబ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం మండల అధ్యక్షుడు సిద్ధేశ్వర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా శేఖర్, అధ్యక్షుడుగా సందీప్, ఉపాధ్యక్షుడుగా విలాస్, ప్రధానకార్యదర్శిగా దీపక్, కోశాధికారిగా హరిచరణ్, సంయుక్త కార్యదర్శిగా శిరీష్, సలహాదారుడిగా సత్య నారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మోడల్ గ్రంథాలయం ప్రారంభం

లింగాపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంజారి గూడా ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా రూమ్ టురీడ్ ఆధ్వర్యంలో మోడల్ గ్రంథాలయాన్ని ఎంఈవో యం శీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూమ్‌టురీడ్ గ్రంథాలయాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులకు చదవడం, రాయడం, గుర్తించడం సులభంగా అర్థమయ్యే విధానంలో పుస్తకాలను సమకూర్చి గ్రంథాలయాలను ప్రారంభిస్తున్నామని అన్నారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాగర్, ఉపాధ్యాయులు కైలాస్, యువరాజ్, సంజీవ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లహుజీ సాల్వే జయంతి

జైనూర్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణేష్‌నగర్ కాలనీలో గురువారం క్రాంతివీరుడు లహుజీ సాల్వే జయంతిని దళితులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా లహుజీ సాల్వే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాంగ్ సమాజ్ జిల్లాఅధ్యక్షుడు పుల్లారె విజయ్ కుమార్ మాట్లాడుతు హుజీసాల్వే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ఉద్యమబాటలో పయనించి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాంగ్ సమాజ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మవాలె దత్త, నాయకులు మవాలె భారత్, జనార్దన్, షికారె దొండిబా, పుల్లారె దిలీప్ కుమార్, పుల్లారె సోపాన్‌రావ్, కోటంబే గున్వంత్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలి

శ్రీరాంపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలని టార్గెట్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ జీఎం(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) ఎ మనోహర్ అన్నారు. 2025-26ఆర్థిక సంవత్సరంలో శ్రీరాంపూర్‌లోని గనులు సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు లక్ష్యాలను నిర్దేశించే కమిటీ ఏరియాలో గురువారం పర్యటించింది. అనంతరం గెస్ట్‌హౌస్‌లో ఇన్‌చార్జి జీఎం ఎస్. సత్యనారాయణ, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. లక్ష్యసాధనకు అవసరమయ్యే యంత్రాలు, పనిస్థలాలు, పరికరాలు, కావాల్సిన విడిభాగాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎం(పీఅండ్‌పీ) సాయిబాబు, జీఎం(ఉపరితలగనులు) సూర్యనారాయణరాజు, జీఎం(భూగర్భ గనులు) రఘురాంరెడ్డి, టార్గెట్ కమిటీసభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

మధుమేహం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీరాంపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు మధుమేహం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం డాక్టర్ పి రమేష్ బాబు అన్నారు. ప్రపంచమధుమేహ దినోత్సవం సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో జీఎం కార్యాల యంలో వైద్యశిబిరం నిర్వహించారు. మంచి ఆహారనియమాలు, వ్యాయామంతో వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. ఉద్యోగులు విధులుసక్రమంగా నిర్వహిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సింగరేణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత.. మనందరి బాధ్యత



శ్రీరాంపూర్ ఓసీపీలో మాట్లాడుతున్న మేనేజర్



మందమర్రిలో నాణ్యత ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించడం మనబాధ్యత అని శ్రీరాంపూర్ ఎస్‌వోటు జీఎం ఎస్ సత్యనారాయణ అన్నారు. ఈనెల 14నుంచి 20వరకు జరగనున్న నాణ్యతా వారోత్సవాలను కోల్‌కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఓఎస్‌డీ సుబ్రహ్మణ్యంతో కలిసి గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్‌లో నాణ్యతగల బొగ్గును అందించే వారికే మనుగడ ఉంటుందన్నారు. విదేశాలనుంచి దిగుబడి అయ్యే బొగ్గుకు దీటుగా సింగరేణి ఉత్పత్తిచేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఏరియా రక్షణాధికారిశ్రీధర్‌రావు, తదితరులుపాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఉత్సవాలను మేనేజర్ బ్రహ్మాజీరావు ప్రారంభిం చారు. బొగ్గు నాణ్యత, వినియోగదారుడు, నాణ్యతాలోపము, నివారణ చర్యలు, ఓసీపీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రత, సీములవద్ద డ్రిల్లింగ్ చేయు విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి వివరించారు. అనంతరం ఉద్యోగులతో బొగ్గు నాణ్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఇన్‌చార్జి రక్షణాధికారి సంపత్, సంక్షేమాధికారి బి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: వినియోగదారుడికి అందించేవస్తు నాణ్యత, ఉత్పత్తి సంస్థ మనుగడను నిర్దేశిస్తుందని జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. గురువారం ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో నాణ్యత బొగ్గు ఉత్పత్తితోనే మనుగడ ఉంటుందన్నారు. నాణ్యమైన బొగ్గు విషయంలో సింగరేణి సంస్థకు దేశవ్యాప్తంగా మంచి పేరు ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెర, ఫైనాన్స్ మేనేజర్ ఎం రవికుమార్, పర్సన్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, క్వాలిటి ఇన్‌చార్జి గుమాస రవి, సీనియర్ పర్సనల్ అధికారి ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: నాణ్యమైన వస్తువులకే మార్కెట్‌లో గిరాకీ ఉంటుందని బెల్లంపల్లి ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం బొగ్గునాణ్యత వారోత్సవాల సందర్భంగా జీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన బొగ్గును పరిశ్రమలకు సరఫరాచేయడం మంచి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం బొగ్గు నాణ్యత ప్రమాణాల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌సెక్రటరీ సలేంద్రసత్యనారాయణ, క్వాలిటీఇన్‌చార్జీ అధికారి వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పిల్లలకు వ్యాక్సినేషన్ పూర్తిస్థాయిలో జరగాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో హరీ‌ష్‌రాజ్‌తో కలిసి మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో టీకాల కార్యక్రమం మైక్రో యాక్షన్ ప్లాన్ అమలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీకాలను కోల్డ్‌చైన్ సిస్టంతో నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా శిక్షణ పొందాలని తెలిపారు. పిల్లలకు పోలియో వ్యాక్సిన్, డీపీటీ, బీపీటీ, మీజిల్స్, రూబెల్లా, హైపటైటిస్ బీ ఇస్తారని, బర్త్ ప్లానింగ్‌లో వ్యాక్సిన్ ఎక్కడ తీసుకోవాలనే వివరాలను తెలుపాలన్నారు. డీపీటీ డోస్ 5,10,16 సంవత్సరాలకు పాఠశాల ఆవరణలో అందజేయాలని, యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ బుధవారం, గ్రామాల్లో ప్రతీ శనివారం వ్యాక్సినేషన్ చేపట్టలన్నారు. డీపీహెచ్‌ఎస్ పద్మ, డీపీవో ప్రశాంతి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, మాస్ మీడి యా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జైపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. గురువారం గురుకుల పాఠశాల (కోటపల్లి)ను సందర్శించి విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన ప్రత్యేకాధికారి

తాండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే, కస్తూర్బా పాఠశాలలను, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని గురువారం మండల ప్రత్యేకాధికారి అంజయ్య సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంట గదులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అనిల్‌కుమార్, కవిత, వినోద్‌కుమార్, నందకుమార్, దివాకర్, ఉదయ్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రైతు సేవలో కేవీకే

- కేవీకే ఆధ్వర్యంలో కోళ్లు, విత్తనాల పంపిణీ
- సాగులో మెళకువలు..
- రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు



కేవీకేలో పెంచుతున్న కోడి పిల్లలు



కేవీకేలో విత్తనాల ఉత్పత్తికి వేసిన కంది పంట

బెల్లంపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు జిల్లాల్లోని రైతులకు వివిధ పంటల సాగులో మెళకువలు, శిక్షణ కార్యక్రమాలు ఇస్తోంది. వివిధ రకాల పప్పు దినుసులు, వరి, ఇతర పంటలకు సంబంధించి విత్తనాలతో పాటు కోడి పిల్లలను రైతులకు ఉచితంగా అందజేస్తూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తోంది. పలు గ్రామాలను దత్తత తీసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా తోడ్పాటు ఇస్తున్నారు.

● కేవీకే ఆధ్వర్యంలో అధిక దిగుబడినిచ్చే విత్తనాలు

బెల్లంపల్లిలో 6 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం రెండుజిల్లాల రైతులకు సేవలందిస్తోంది. కుమరంభీంఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని రైతులకు వివిధ పంటలపై శిక్షణ తరగతులు ఇస్తోంది. కేవీకే ఆధ్వర్యంలో తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి వచ్చే విధంగా వివిధ రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో సంబంధిత శాస్త్రవేత్తలు పలు పంటలకు సంబధించిన పప్పు దినుసులు, ఇతర ఆహార ఉత్పత్తుల పంటలను పండించి అధికదిగుబడిని ఇచ్చే మేలురకం విత్తనాలను అందిస్తున్నారు. వరి, జొన్న, కంది, నువ్వులు, శనగవంటి వంగడాలతో పాటు కూరగాయల విత్తనాలను ఇస్తున్నారు. తక్కువ రోజుల్లోనే పంట చేతికి వచ్చే పంటలకు సంబంధించిన విత్తనాలను, అధిక దిగుబడి వచ్చే వాటిని ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నారు. జొన్నలో సీఎస్‌వీ -29, ఎస్‌టీజే-5, సీఎస్‌వీ -41, వరిలో కెఎన్ఎం-118, కెఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్-15084, కందిలో డబ్ల్యూఆర్‌జీఈ-97, నువ్వుల్లో జేసీఎస్ -1020 రకాల వంటి జాతీయ స్థాయి గుర్తింపు పొందిన విత్తనాలను అందజేస్తున్నారు. దిగుబడి సైతం సాధారణ రకాల కంటే అధికంగా వస్తుంది. అలాగే వానపాముల ఎరువు, తేనెటీగలు, పెరటికోళ్ల పెంపకం శిక్షణ తరగతులు ఇస్తున్నారు.

● గ్రామాలు దత్తత తీసుకున్న రైతులను అభివృద్ధి పరుస్తూ..

మంచిర్యాల, కుమరంభీంఆసిఫాబాద్ జిల్లాల్లో కేవీకే శాస్త్రవేత్తలు పది గ్రామాలను దత్తత తీసుకున్నారు. గ్రామాల్లో రైతులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తూ రైతులు పండించే పంటలపై అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ సాగు పెంచే విధంగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయంలో మెళకువలు నేర్చుకున్న రైతులు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. అంతే కాకుండా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతుల ఆర్థికాభి వృద్ధికి కేవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నాటుకోళ్లు, మేకల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధికి పంటల సాగుతోపాటు నాటుకోళ్లు, మేకల పెంపకం ద్వారా గిరిజనులకు అధిక ఆదాయం వస్తుందనే ఉద్దేశ్యంతో ఉచితంగా కోడి పిల్లలు, మేక పిల్లలు పంపిణీ చేశారు. ఒక్కరోజు వయస్సున్న వెయ్యి కోడి పిల్లలను హైద్రాబాద్ నుంచి తీసుకువచ్చారు. 30 రోజుల పాటు పెంచిన తర్వాత 200 మంది గిరిజన రైతులకు 30 రోజుల వయస్సున్న వివిధ రకాల నాటుకోళ్లు, కడక్‌నాథ్, వనరాజా కోళ్లను ఒక్కో రైతుకు 6 పిల్లలను ఉచితంగా అందిస్తున్నారు. గతంలో మేక పిల్లల పంపిణీ సైతం చేపట్టారు.



రైతులతో కేవీకే శాస్త్రవేత్తలు

రైతుల అభివృద్ధికి చర్యలు



గిరిజన రైతులు, యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. రైతులకు అధిక ఆదాయం వచ్చేందుకు ఎన్నో రకాల అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను పంపిణీ చేస్తున్నాం. కేవీకేలో రైతు లకు ఉపయోగపడేలా వ్యవసాయంపై ఎప్పటికప్పుడు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఎంతో మంది రైతులు వ్యవసాయంలో మెళకువలు నేర్చుకుని పంటల్లో అధిక దిగుబడి సాధిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఎంతో మంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

- డాక్టర్ కోట శివకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్

ప్రారంభమైన వరి కోతలు

5వ పేజీ తరువాయి..

ధాన్యాన్ని ఆరబోసేందుకు స్థలం లేకపోవడంతో తేమ సమస్యను ఎదుర్కొంటు న్నారు. తేమశాతం సాకుగా చూపి నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలోనూ రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రైస్ మిల్లు లకు తీసుకువెళ్లిన తర్వాత మిల్లర్లు ధాన్యం సరిగా లేదని తీసుకోవడానికి కొర్రీలు పెడుతున్నారు. అడుగడు గునా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమ స్యలను తొలగించే విషయంపై ఈ సీజన్‌లోలైనా అధి కారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

సన్నాలకు బోనస్ అందేనా...?

సన్నరకాలకు రూ.500 బోనస్ చెల్లింపులపై రైతుల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ యేడాది కేంద్రం ప్రకటిం చిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ఉన్నాయి. సన్న రకాలకు అదనంగా బోనస్ క్వింటాలుకు రూ.500 చెల్లిం చాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేనికారణంగా రైతుల్లో సందేహాలు వ్యక్తమవుతు న్నాయి.

తీరని గోనె సంచుల కొరత...!

గోనె సంచులు, లారీల సమస్య ప్రతీ సారీ వేధిస్తూనే ఉంది. ధాన్యం కొనుగోళ్లకు సంచుల కొరత లేదని అధి కారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఈ సమస్య తీవ్రం గానే ఉంది. వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 82.49 లక్షల గోనె సంచులు అవసరం కాగా, ప్రస్తుతం 50లక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో 32.49లక్షల సంచులను సేకరించాల్సి ఉండగా కోతలు ప్రారంభమైనా గోనె సంచులు జిల్లాకు చేర లేదు. అకాల వర్షాల కారణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఉండేందుకు లారీల కొర త తీర్చడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో ఐదుగురు చొప్పున సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



నర్సింగ్ కాలేజీలో మధుమేహ దినోత్సవంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

గర్మిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని గురువారం రాముని చెరువు కట్టపై లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం 2కే రన్ నిర్వహించారు. డాక్టర్ విశ్వేశ్వర్‌రావు మధుమేహంపై అవగాహన కల్పించారు. వేంపల్లి నర్సింగ్ కాలేజీలో 200 మంది విద్యార్థులకు డయాబెటిస్‌పై అవగాహన కల్పించారు. శ్రీనివాసరావు, రాజమౌళి, శ్రీనివాస్, బాలమోహన్, సుగుణాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, బాబు, వెంకటేశ్వర్లు, నర్సింగ్ కాలేజీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): జాతీయ డయాబెటిస్ దినోత్సవాన్ని మ్యాదరిపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 200 మందికి బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శు మాదంశెట్టి మల్లిఖార్జున్, కొండు జనార్దన్‌లు మాట్లాడుతూ రోజు వాకింగ్‌తోపాటు వ్యాయామం చేయాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాజన్న, రామన్న, నరేందర్, డాక్టర్ అమరేందర్‌రావు రమేష్, బుచ్చన్న, మల్లేష్, వేణు, లచ్చన్న, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు

ఎస్ఈని కలిసిన సీఐటీయూ బృందం

గర్మిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన వడ్లకొండ గంగాధర్‌ను సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చిందం వెంకటేష్, నాయకులు రాజేశం, అరుణ్‌కుమార్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి పోస్టుకార్డులు



పోస్టుకార్డులు పంపుతున్న నాయకులు

గర్మిళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2025లో నిర్వహించే జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపట్టాలని గురువారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు ప్రధాని మోదీకి పోస్టుకార్డులు పంపించారు. నాయకులు మాట్లాడుతూ చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌లు బీసీలకు కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణన పట్టికలో 34 కాలమ్స్ ఉన్నాయని, కుల గణన చేస్తే అదనంగా ఇంకో కాలం మాత్రమే చేరుతుందని, దీనికి ఖర్చు కూడా కాదని పేర్కొన్నారు. నాయకులు గుమ్ముల శ్రీనివాస్, కర్రె లచ్చన్న, బీమ్‌సేన్, రమణచారి, భిక్షపతి, సతీష్, రాజేశం, సతీష్, కుమార్, సురేందర్‌చారి, బాలాజీ పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక పౌర్ణమి శోభ

- కళకళలాడుతున్న మార్కెట్లు, పూజా సెంటర్లు
- వ్రతాలు, పూజలకు అన్ని ఏర్పాట్లు...



మార్కెట్‌లో పూలు, ఉసిరికాయలు కొనుగోలు చేస్తున్న మహిళలు, గూడెంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

జిల్లాలోని ఆయా ప్రాంతాల మార్కెట్లకు పౌర్ణమి కళ సంతరించుకుంది. సత్యనారాయణ వ్రతానికి వినియోగించే పూజ సామగ్రి, కొబ్బరికాయలు, తమలపాకులు, ఉసిరికాయలు, నూనె, నెయ్యి, ఉసిరికొమ్మల విక్రయాలతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. కిలో బంతి పూలు రూ. 100, ఉసిరి కాయలు కిలో రూ.100, అరటి పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేశారు.

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలో పూజా సామగ్రికి గిరాకీ పెరిగింది. మార్కెట్ సెంటర్‌లో బంతి పూలు, వత్తులు, దీపాలు, పండ్లు కొనుగోలు చేశారు. సాయిబాబా ఆలయం, శివాలయం, రామాలయంలను ముస్తాబు చేశారు.

నస్పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభమైన నాటి నుంచి కార్తీక పూజలతో ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసంలో గోదావరి నది స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వ హిస్తున్నారు. శివకేశవులకు ప్రీతికరమైన మాసంలో ఆలయాల్లో రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, రుద్రపూజలకు ఏర్పాట్లు చేశారు. కార్తీకంలో గృహిణి లు, యువతులు ఉదయమే స్నానం చేసి తులసికి దీపారాధన చేసి గౌరీదేవిని పూజిస్తారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపదానాలు, ఉసిరి చెట్టు కింద భోజనాలు, తులసీ కల్యాణం నిర్వహణలో భక్తులు నిమగ్నమయ్యారు. లక్ష తులసి దళాలు, బిల్వపత్రాలు, మారేడు దళాలతో భక్తులు పూజ చేస్తారు. జిల్లాలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మార్కెట్లో సామగ్రి కొనుగోళ్ళు, ఆలయాల ముస్తాబు చేశారు.

కార్తీక పూజలతో భక్తుల సందడి

దండేపల్లి,(ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం భక్తులతో సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి నదిలో కార్తీక దీపాలు వదిలారు. వందలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా స్వామి వ్రతాలను ఆచరించారు. మహిళలు రావి చెట్టు, ధ్వజస్తంభం వద్ద ఉసిరి కాయలతో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

క్రీడల్లో రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మైదానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కాళేశ్వరం జోన్ 10వ క్రీడా పోటీలు ముగిసాయి. ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. జోనల్ ఇన్‌చార్జీ అరుణకుమారి, ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, తహసీల్దార్ దిలీప్‌కుమార్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రెబ్బనపల్లి వాలీబాల్ పోటీలో బహుమతులు అందుకున్న బాలికలు

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి అండర్14 బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు గురువారం ముగిసాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా 50మంది క్రీడకారులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా ప్రథమ, ఆదిలాబాద్ ద్వితీయస్థానంలో నిలిచాయి. సిద్దిపేట జిల్లా చేగుంటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ ఫణిరాజా, ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజు, కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి, పీఈటీలు రామ్మోహన్‌రావు, రోజి వర కుమారి, సిరంగ గోపాల్, ఎండి యాకుబ్, సత్యనారాయణ, సాంబమూర్తి, వహిద్, బేగం, కార్తీక్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు 12 మంది బాలికలను ఎంపిక చేశారు. మంచిర్యాల జిల్లా నుంచి పి. హరిప్రియ, ఏ శాలిని (లక్షెట్టిపేట), శ్రీవర్షిణి, ఎం నక్షత్ర (ఆస్నాద్), ఎం శ్రావణి (తాళ్లపేట), బి అభిశ్రీ (రెబ్బనపల్లి), ఆదిలాబాద్ జిల్లా జయదీక్ష, జే ఆకాంక్ష (మన్నూర్), నిర్మల్ జిల్లా టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ చెందిన విద్యార్థిని ఎం. రుతుజు (పోచంపాడు), పి దీపిక (కుంటాల), టి నవనీత (దిలావర్‌పూర్), ఆసిఫాబాద్ జిల్లా ఆర్ వర్షిత్ (ఆరెగూడ)లు ఎంపికయ్యారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



జెండ ఎగుర వేస్తున్న చైర్మన్

దండేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కృషి చేస్తోందని నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం చైర్మన్ కాసనగోట్లు లింగన్న అన్నారు. సహకార సంఘం వారోత్సవాల్లో భాగంగా గురువారం దండేపల్లి కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు, విత్తనాలు, ఎరువుల నుంచి ధాన్యాన్ని విక్రయించే వరకు సంఘం రైతులకు సేవలు అందిస్తుందన్నారు. సీఈవో సింగతి కిషన్, డైరెక్టర్ కందిరవి, సిబ్బంది వెంకటేష్, రవి సాయి తదితరులు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారం, జైపూర్ ఉమ్మడి మండలాల సహకార సంఘం వారోత్సవాలను నిర్వహించారు. డైరెక్టర్ పానుగంటి లక్ష్మణ్ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరు సహకార సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

భీం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



రొట్టెపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల కోసం అమరుడైన కొము రం భీం పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం రొట్టెపల్లి పంచాయతీ చిక్రం గూడలో నిర్వహించిన వర్ధంతికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. జల్ జంగల్ జమీన్‌పై ఆదివాసీలకు పూర్తి హక్కులు ఉండాలనే నినాదంతో నైజాం ప్రభుత్వంతో పోరాడారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 యాక్టు, పీసా చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వం విలఫమైందన్నారు. హక్కుల సాధనకు ఆది వాసీలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. గిరిజన సంప్రదాయ వాయిద్యాలతో మాజీ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. పెంద్రం హన్మంతు, కొమ్ముల బాపు, ఆత్రం జంగు, పల్లె చంద్రయ్య, మడావి వెంకటేష్, రామ కృష్ణ, గణపతి, ప్రవీణ్ నాయక్, రమణారెడ్డి, పాల్గొన్నారు.

విద్యార్థులను మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

జన్నారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, ఆటల పట్ల ఆసక్తి కనబర్చేలా చూడాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. గురువారం కలమడుగు జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు ఏర్పడ్డాయని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు అన్ని విధాలుగా అండగా నిలవాలని పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించామన్నారు. హెచ్ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

రెబ్బెన, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుంజుమేరగూడలో గురువారం ఆర్‌బీఐ, విడ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భగా ఢిల్లీకి చెందిన డీఎఫ్ఎస్ అధికారి సుర్జిత్ కార్తికేయన్, ఎజీఎం శ్రీహరి మాట్లాడుతూ అక్షరాస్యతతోనే అంతా సాధించవచ్చన్నారు. అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రాజేశ్వర్ జోషి, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు యాదగిరి, టీజీబీ రాజశేఖర్, ఎంపీఎం వెంకటశర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో నిరుపేదలకు గుర్తింపు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జైనూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో నిరుపేద కార్యకర్తలకే గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో గురువారం నూతనంగా నియామకమైన మార్కెట్‌కమిటీపాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దశలవారీగా 2లక్షలలోపు రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గం సభ్యులకు అధికారులు, పార్టీ నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్, మాజీగ్రంథాలయ సంస్థ చైర్మెన్ కనకయాదవ్‌రావ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడావిభీంరావ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు



ఆసిఫాబాద్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ అలీబీన్ అహ్మద్

ఆసిఫాబాద్‌రూరల్/తిర్యాణి/దహెగాం/కౌటాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రాథమిక సహకారసంఘంలో, మండల కేంద్రాల్లోని సహకార కేంద్రాల్లో గురువారం అఖిల భారతసహకార వారోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్లు అలీబీన్‌అహ్మద్, శ్రీనివాస్, తిరు పతిగౌడ్, మాంతయ్య పతాకావిష్కరణ చేశారు. జిల్లాకేంద్రంలో ఏడీసీసీ మేనే జర్ సురేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు, డైరెక్టర్‌లు, మేనేజర్లు, క్యాషియర్లు, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరుకు వన్నె తెచ్చిన మహాకవి మాధవాచారి



శ్రీరంగధామేశ్వర శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

బెజ్జూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాహితీరంగంలో కవిగా ఎదిగి విశేషసేవలు అందించి బెజ్జూరుకు వన్నె తెచ్చిన మహాకవి మాధవాచారి అని కవి, సభఅధ్యక్షుడు మాడుగుల నారాయణమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రంగనాయక ఆలయప్రాంగణంలో దివంగత డిప్యూటీ తహసీల్దార్, సాహితీవేత్త కవిఏలేశ్వర మాధవాచారి రచించిన శ్రీరంగధామేశ్వర శతకం పుస్తకాన్ని ఆయన సతీమణి ఏలేశ్వరం పద్మతోపాటు పలువురు కవులు, కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సభ అధ్యక్షుడు నారాయణ మూర్తి మాట్లాడుతూ ఒకవైపుఉద్యోగరీత్యా విధులు నిర్వహిస్తూనే సాహితీ రంగంలో కవిగా ఎదిగి పుస్తకాలు రచించడం చాలాగొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కవులు తుమ్మోరి రామ్మోహన్‌రావు, మురళీధర్‌గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, రాజేందర్, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీశంకర్, ఎంఈవో సునీత, ఆర్ఐ అచ్యుత్‌రావు, ఆలయకమిటీ అధ్యక్షుడు మహేష్, కంకలమ్మ ఆలయ చైర్మన్ కనకయ్య, భాస్కర్‌రాజు, ఉపాధ్యాయులు భాస్కర్, నర్సింహచారి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి మెస్‌చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మండలకమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకే సాయికుమార్, చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమవసతి గృహాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిధులు పెంచటం లేదన్నారు. ఇప్పటికైనా వెంటనే నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు రక్షిత, ఝాన్సీరాణి, నూష్, దీపక్, తేజస్విని, శ్రీ హర్షిత, కీర్తన, పూజ తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రూపు-3పరీక్ష కోసం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షకేంద్రాలను గురువారం కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై సంబంధిత కరస్పాండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షరాసే విద్యారుల్థకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఆమెవెంట తహసీల్దార్ కిరణ్ ఉన్నారు.

రైతుకు భరోసా అందేనా?



● యాసంగి సాగు వచ్చే..
● పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కార్..
● భారంగా మారుతున్న విత్తన, ఎరువుల కొనుగోలు..

చింతలమానేపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ముగిసింది.. యాసంగి సీజన్ వచ్చేసింది.. అయినా ప్రభుత్వం రైతుభరోసాపై స్పష్టతనివ్వడం లేదు. కనీసం ఈ సీజన్‌లోనైనా పెట్టుబడి సాయం అందుతుందా..అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం 2018యాసంగి వానాకాలం నుంచి 2023యాసంగి వరకు వరుసగా 12సార్లు పెట్టుబడి సాయం అందించింది. సీజన్ ప్రారంభానికి ముందే రైతు బంధు ఇవ్వడంతో రైతులు సకాలంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునేవారు.

● స్పష్టత కరువు..

గతేడాది డిసెంబరులో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి రాగానే రైతుభరోసా ప్రతీ ఏడాది ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి 11నెలలు గడిచినా పెట్టుబడి సాయంపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే వానాకాలం సీజన్ గడిచిపోయింది. యాసంగిసీజన్ రానేవచ్చింది. వ్యవసాయ శాఖ అధికారులు సాగు అంచనా సైతం ఖరారు చేస్తున్నారు. వానాకాలంలో ఎలాగూ ఇవ్వలేదు. కనీసం యాసంగిలోనైనా సాయం అందుతుందా..లేదా అంటూ రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

● విత్తనాలు, ఎరువులు ఇలా..

జిల్లాలోని యాసంగి సీజన్‌లో సుమారుగా 2లక్షల ఎకరాల పైనే వివిధపంటలు సాగవుతాయని అంచనా ఉంది. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, నువ్వులు, మినుములు, పెసరా, కూరగాయలు తదితర పంటలు సాగవుతాయి. అయితే జిల్లాలోని రైతులకు సుమారుగా యూరియా 20వేల టన్నులు, డీఏపీ 12వేల టన్నులు, పొటాష్ 5వేల టన్నులు, కాంప్లెక్స్ 20వేల టన్నుల వరకు అవసరమయ్యే అవకాశం ఉన్నది. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా అధి కారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందుకు వచ్చి రైతు భరోసా అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

● గందరగోళంగా రుణమాఫీ..

జిల్లాలో రుణమాఫీ సైతం గందరగోళంగా మారింది. ఏ ప్రాతిపదికన రుణమాఫీ చేశారో అర్థం కాని పరిస్థితి నెలకొం దని రైతులు వాపోతున్నారు. లేనిపోని సాకులతో అనేక మంది రైతుల రుణాలు మాఫీకాలేదు. తెల్లరేషన్ కార్డు లేని వారికి అధికారులు కుటుంబ నిర్ధారణ చేశారు. అయితే ఇప్పటివరకు వారి ఖాతాల్లో రుణడబ్బులను జమ చేయలేదు. ఈవిషయంపై రైతులు అధికారులను అడిగితే తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం నేరుగా డేటా తీసుకుందని అంటున్నారు. అలాగే రైతుభరోసా సైతం ఏ ప్రాతిపదికన ఇస్తారనేది ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు.

పెట్టుబడి సాయం అందజేయాలి..

- చౌదరి ఓంకార్, రైతు, చింతలమానేపల్లి



యాసంగి సీజన్‌లో నేను రెండు ఎకరాల్లో పెసరా పంట, అరఎకరంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. ఈ పంటలకు పిచికారి చేసేందుకు పురుగుమందులు, ఇతర ఎరువులు కావాల్సి ఉన్నది. ప్రస్తుతం చేతిలో డబ్బులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా అందజేస్తే పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటుంది.

బాలల హక్కులను కాపాడుదాం: కలెక్టర్



బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను సమిష్టిగా కాపాడుదామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మాజీప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జిల్లా మహిళా, సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాలలదినోత్సవంలో జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్‌తో కలిసి హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలనచేసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ బాల్యం చాలా అమూల్యమైనదని అన్నారు. బాలలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపట్ల గౌరవభావం అలవర్చాలని అన్నారు. సమాజంలో ఉన్నతంగా ఎదిగేలా ప్రోత్సహించాలని అన్నారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, దేశ భవిష్యత్ అని, బాలల సంక్షేమం, సంరక్షణకు అందరం సమిష్టిగా కృషిచేద్దామని తెలిపారు. అనంతరంవిద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి మహేష్, సీడీపీవో సాదియా రుక్సానా, బాలరక్షక్ భవన్, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు..

ఆసిఫాబాద్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని జిల్లాకేంద్ర గ్రంథాలయశాఖ భవనంలో ఏర్పాటుచేసిన 57వ జాతీయగ్రంథాలయ వారోత్సవాలకు అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే బాండాగారాలని అన్నారు. ఈనెల 20వరకు జిల్లాలో జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. గ్రంథాలయాల్లో ఎన్నో ప్రాచీనచరిత్రకు సంబంధించిన గ్రంథాలు ఉంటాయని తద్వారా భవిష్యత్ తరాలకు మనచరిత్ర తెలుస్తుందని అన్నారు. మనకువిద్య అందించిన గురువులకు, తల్లితండ్రులకు ఎప్పుడు రుణపడి ఉండాలన్నారు. మన లక్ష్యాన్ని సాధించడంలో గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపకరంగా ఉంటాయన్నారు. పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి సరిత, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వసతిగృహ పనులను త్వరగా పూర్తిచేయాలి

ఆసిఫాబాద్ రూరల్: జిల్లాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు వసతికల్పించేందుకు చేపట్టిన వసతిగృహ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రేఅన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని జన్కాపూర్‌లో పాతకలెక్టరేట్ వైటీసీ భవనంలో నర్సింగ్‌కళాశాల విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటుకు చేపట్టిన పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారితోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతిగృహంలో విద్యార్థినులకు ఎలాంటిఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని తెలిపారు. భవన మరమ్మతులు, మూత్రశాలలు, ఇతరపనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యంకలగకుండా చర్యలుతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి..

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం మండలంలోని మోతుగూడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల జాతీయ రహదారికి సమీపంలో ఉన్నందున విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ నిర్మించాలని విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

కౌటాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన గర్రెపల్లి శ్రావణ్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ చేయగా గురుస్వాములు అయ్యప్పకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాడినపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సెల్‌ఫోన్ అప్పగింత

సిర్పూర్(టి), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని టోంకినిఆలయంలో మంగళవారందొరికిన సెల్‌ఫోన్‌ను ఆలయ నిర్వాహకుడు మారుతి గురువారం ఎస్సై కమలాకర్‌కు అప్పగించారు. ఈ విషయంపై ఎస్సై విచారణ జరిపి సెల్‌ఫోన్‌ను ఆధార్‌కార్డు ప్రకారం మండలకేంద్రానికి చెందిన జ్యోతికి గురువారం పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

ఘనంగా రాంజీ సత్పాల్ జయంతి



నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

వాంకిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తండ్రి రాంజీసత్పాల్ జయంతిని గురువారం మండలంలోని బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ రాంజీ సత్పాల్ మిలిట్రి సుబేదార్‌గా పనిచేసిన కాలంలో ఎదుర్కొన్న అంటరానితనం నుంచి సమాజాన్ని కాపాడేందుకు అంబేద్కర్‌ను ఉన్నత చదువులు చదివించారన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ ఉపాధ్యక్షుడు వినేష్, జైరాం, ప్రసాద్, విజయ్, ప్రశాంత్, రోషన్, ప్రతాప్, అరుణ్, బలవంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



కాగజ్‌నగర్‌లో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు



ఆసిఫాబాద్‌లో పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని

ఆసిఫాబాద్‌రూరల్/కౌటాల/పెంచికలపేట/బెజ్జూరు/దహెగాం/సిర్పూర్(టి)/జైనూర్/కాగజ్‌నగర్/రెబ్బెన/కెరమెరి,నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండ లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగామారి పాఠాలు బోధించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే పట్టణంలోని బీసీసంఘ భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నార్ రమేష్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 17,18తేదీల్లో జరగనున్న గ్రూపు-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పరీక్షల రీజనల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనర్సింహతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్‌లు, శాఖ అధికారులు, పరిశీలకులు, రూట్ అధికారులు ఐడెంటిఫికేషన్ సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు-3 పరీక్షకు జిల్లాలో 18పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షాకేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, విద్యుత్, వైద్యసిబ్బంది తదితర అన్నివసతులు కల్పిస్తున్నామన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమీప జిరాక్స్‌సెంటర్లు మూసి వేయించాలన్నారు. పరీక్షాకేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ తప్ప వేరేఎవరికి మొబైల్ అనుమతి లేదని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతిపరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సహాయరీజన్ కోఆర్డినేటర్‌రాజేశ్వర్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు వార్షిక రుణలక్ష్యాలను సాధించాలి..

ఆర్థిక సంవత్సరం2024-25కి సంబంధించిన వార్షిక రుణ లక్ష్యాలనుసాధించే దిశగా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో స్టేట్‌బ్యాంక్‌ఆఫ్‌ఇండియా ప్రాంతీయ సమన్వయకర్త సుర్జిత్ కార్తికేయన్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీహరితో కలిసి ద్వితీయత్రైమాసిక సమావేశానికి హాజరై బ్యాంకు అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక సంవత్సరంలో నిర్దేశించిన రుణలక్ష్యాన్ని సాధించే దిశగా బ్యాంకర్లు సమన్వయంతో కృషిచేయాలని తెలిపారు. స్వయం సహాయకసంఘాల బ్యాంకులింకేజిలు వంద శాతం పూర్తి చేసే విధంగా బ్యాంకర్లు, సెర్ప్‌అధికారులు కృషిచేయాలని తెలిపారు. ప్రధానమంత్రి స్వనిధి, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, ముద్ర స్టార్టప్ ఇండియా పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి కల్పించే విధంగా రుణ మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ సంక్షేమ కార్పొరేషన్, ఎస్టీ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలలో రాయితీనిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని, అసంఘటిత రంగాల వారు ఉపాధిపొంది ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి బ్యాంకు శాఖలు నాలుగు గ్రామాలను దత్తత తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యత కల్పనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణాభి వృద్ధి అధికారి రామకృష్ణ, గిరిజన అభివృద్ధి అధికారిణి రమాదేవి, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, బ్యాంకు మేనేజర్లు, సెర్ప్, మెప్మా అధికారులు, డీడీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు పూర్తిచేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అప్పపల్లి గ్రామలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు రావడానికి తేదీల వారీగా రైతులకు టోకెన్లు జారీచేయాలన్నారు.

నిబంధనల ప్రకారం17శాతం తేమఉంటేనే కేంద్రానికి తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తూకం జరిగిన ధాన్యంను వెంటనే కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ వ్యవసాధికారులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆశ్రమబాలుర పాఠశాలను గురువారం జిల్లా వైద్యాధికారి సీతారాం తనిఖీచేశారు. ఈ సంద ర్భంగా వసతిగృహం, వంటశాలలోని భోజనాన్నిపరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న వసతులపై వారిని అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయనవెంట వైద్యఆరోగ్యసిబ్బంది వాసుదేవ్, శ్యాంలాల్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి తొలగింపు

వాంకిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విధులపట్ల నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడిని తొలగించినట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంలోని ఆశ్రమ బాలికలపాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతకు గురయ్యారని ఈఘటనపై ఏర్పాటుచేసిన కమిటీ విచారణలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారని తెలియడంతో విధుల నుంచి తొలగించామని తెలిపారు.